క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంక్‌లో పనిచేసేందుకు నౌజల్ వర్కర్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సహకార సంస్థ మేనేజర్ బాలాజీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌లో నౌజల్ వర్కర్స్‌గా పనిచేయుటకు గిరిజన యువతీ, యువకులు నుంచి ఈనెల 9 నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల యువత ఈనెల 11న 5 గంటల లోపు ఇచ్చోడ గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో(జీసీసీ)లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 93814 56623, 94418 38003 సంప్రదించాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: బోథ్ మండల కేంద్రం నుంచి పొచ్చెర వంతెన వరకు రోడ్డు గుంతల మయంగా మారడంతో మేనెల 31న 'వామ్మో.. గుంతలు' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. శనివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గుంతలతో పాటు ప్రమాదకరంగా మారిన కోరమాండల్, సాయినగర్ వంతెనపై మరమ్మతులు చేశారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బోథ్: అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండలంలోని కుచులాపూర్ పరిధిలోని ఓ వెంచర్‌లో అనుమతులు లేకుండా పాఠశాల నిర్మించారని ఆరోపించారు. పాఠశాలకు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సదరు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఇచ్చోడ: మండలంలోని సల్యాదలో ఓట్‌రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం తాగునీటి కోసం చేతిపంపు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామస్తులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి చేతి పంపు ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు సంతోష్ తెలిపారు. మాజీ సర్పంచ్ పెందుర్ రమేశ్, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన అఖిల్ మొదటి వర్ధంతి సందర్భంగా శనివారం స్నేహితులు అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం తమ మధ్యలో లేకపోయినా ఆయన చేసిన సేవలను ఇప్పటికీ మరచిపోలేమన్నారు. కార్యక్రమంలో పలువురు స్నేహితులు పాల్గొన్నారు.

వరద రాకుండా చర్యలు చేపట్టాలి

ఖానాపూర్: పట్టణంలోని జేకేనగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లోకి అటవీ ప్రాంతం నుంచి వరద రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని జేకేనగర్ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న ముంపు ప్రభావిత చెక్‌డ్యాంలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు ముందస్తుగా చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాలన్నారు. కందకాలు తవ్వి చర్యలు తీసుకుంటేనే వరద ప్రభావం లేకుండా చూడవచ్చని కాలనీవాసుల సమక్షంలో అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో యూసుఫ్‌ఖాన్, రాములు, వెంకటేశ్, రాజు, మల్లేశ్, సాగర్ ఉన్నారు.

కొనసాగుతున్న బడిబాట

కుంటాల: నాణ్యమైన విద్య అందిస్తున్న సర్కారుబడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ ముత్యం పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్‌తోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎల్లన్న, రాజేశ్వర్, గిరినాథ్, లక్ష్మణ్, సబ్బిడి నర్సయ్య తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు పైపైకి..

- సెంచరీ దాటిన పచ్చిమిర్చి
- చుక్కలనంటుతున్న ధైనం
- సామాన్యుడిపై భారం

కూరగాయల ధరల వివరాలు..

రకం	కిలోకు ధర
టమాట	రూ.50
పచ్చిమిర్చి	రూ.100
వంకాయ	రూ.70
బీరకాయ	రూ.90
చిక్కుడుకాయ	రూ.100
గోరు చిక్కుడు	రూ.80
పిచ్చిమిర్చి	రూ. 100
పువ్వుగోబి	రూ. 90
క్యారెట్	రూ.80
మునగకాయలు	రూ.120
బెండకాయ	రూ.70
సిమ్లా మిర్చి	రూ.70



కూరగాయలు కొనుగోలు చేస్తున్న మహిళ

కైలాస్‌నగర్: జిల్లాలో కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. భగ్గుమంటున్న ఎండలతో పాటే వాటి ధరలు కూడా మండిపోతున్నాయి. రైతుబజార్‌లో పక్షం రోజుల వ్యవధిలో ధరలు రెట్టింపయ్యాయి. రూ.50 నుంచి రూ.90 పెట్టనిదే ఎలాంటి కూరగాయ రావడం లేదు. దీంతో సామాన్యులు కొనలేని, తినలేని పరిస్థితి నెలకొంది. ఇక ప్రైవేట్ వ్యాపారుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎండకాలం పేరిట మరింత అదనపు ధరను పెంచి విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు బెంబేలెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో దిగుబడి తగ్గి ధరలు పెరిగాయని, మరో నెల రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండనుందని కూరగాయల విక్రయదారులు చెబుతున్నారు.

మండుతున్న ధరలు

వంటింట్లో ఎలాంటి వంటకం చేయాలన్నా టమాట, పచ్చిమిర్చి తప్పనిసరిగా ఉండాలి. రోజువారీ వాడకంలో కీలకమైన వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తుంది. ఏకంగా సెంచరీ దాటేసింది. పక్షం రోజుల కిందట కిలోకు రూ.20కు లభించిన టమాట ధర ప్రస్తుతం రూ.50కి చేరింది. దొండ, బెండ, భీర, కాకరకాయ ధరలు భారీగానే పెరిగాయి. వంకాయ కూడా టమాటతో పోటీపడి రూ.70 కిలో పలుకుతుంది. ఇక క్యారెట్, బీన్స్, బీట్‌రూట్, చిక్కుడుకాయ, ములక్కాయల ధరలు వందకు చేరువయ్యాయి. దీంతో సామాన్యుడు కొనలేని పరిస్థితికి చేరాయి. ఓవైపు భగభగమండే ఎండలతో ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న కూలీలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు పెనుభారంగా మారుతున్నాయి. వాటిని కొనుగోలు చేయడం అటుంచితే ధరలు వింటేనే ఆందోళన చెందుతున్నారు. కిలోల్లో కొనుగోలు చేసే వారు ఇప్పుడు పావు, అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండల ప్రభావమే కారణం..

కూరగాయల ధరలు పెరుగడానికి ఎండల ప్రభావమే కారణమని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఎక్కువగా హైదరాబాద్ నుంచి కూరగాయలు దిగుమతి అవుతుంటాయని అక్కడే తగినంత స్టాక్ లభించని పరిస్థితి ఉందన్నారు. ఎండల తీవ్రత కారణంగా పంటల దిగుబడి తగ్గి దాని ప్రభావం ధరలపై పడిందని అభిప్రాయపడుతున్నారు. నాగ్‌పూర్ నుంచి రావాల్సిన స్టాక్ ఎండల ప్రభావంతో నిలిచిపోయింది. జిల్లాలోని కోలారీ, గుడిహత్నూర్, మన్నూర్, పొన్నారి ప్రాంతాల నుంచి వస్తున్న కూరగాయలతో రైతుబజార్‌లో విక్రయాలు సాగిస్తున్నారని తెలిపారు.

ధరలను నియంత్రించాలి



పెరిగిన కూరగాయల ధరలు ఇబ్బందిగా మారాయి. ఎండలతో పాటే కూరగాయల ధరలు సైతం మండుతున్నాయి. గతంలో రూ.500 తీసుకుపోతే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. కానీ ప్రస్తుతం మూడు, నాలుగు రకాలు సైతం రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి కూరగాయల ధరల కట్టడికి చర్యలు తీసుకోవాలి.

– సంతోష్ , రాంనగర్

ఏం కొనలేని పరిస్థితి



మార్కెట్‌తో పాటు రైతుబజార్‌లోనూ కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. టమాట రూ.50కిలో ఉండగా.. ఇతర రకాల కూరగాయలు వందకు చేరువయ్యాయి. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. కిలోల చొప్పున కొనుగోలు చేసే వారు కూడా పావు, అరకిలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

– కె.మహేందర్, భోరజ్

ఇంకుడు గుంతతో ప్రయోజనం



ఇంకుడు గుంత

- అవగాహన కల్పిస్తే మేలు
- డబ్బుల చెల్లింపులో జాప్యం
- నిర్మించుకునేందుకు ఆసక్తి చూపని ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: వేసవి ప్రారంభమైందంటే చాలు భూగర్భజలాలు అడుగంటిపోతుంటాయి. బోరుబావులు ఎండిపోయి గృహ అవసరాలకే కాకుండా తాగునీటికి సైతం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతారు. వర్షకాలంలో ప్రతీ వర్షపు చుక్క నీరును భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలు పెంచుకోవచ్చు. భూగర్భజలాలను పెంచుకునేందుకు గత ప్రభుత్వాలు ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఇంటి ఆవరణలలో నిర్మించుకోవడంతో పాటు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఖాళీ ప్రదేశాల్లో, చేతి పంపుల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టారు.

తగ్గుతున్న ఆసక్తి..

గత ప్రభుత్వాలు ఇంకుడు గుంతల నిర్మానానికి ఎస్ఆర్ఈజీఎస్ పథకం నుంచి రూ. 6వేలపై నుంచి ఇంకుడు గుంత సైజును బట్టి నిధులు ఇచ్చేది. అయితే మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుమారు 100 వరకు ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టారు. ప్రారంభంలో ఈపథకం మంచి ఫలితాలు ఇచ్చాయి. అయితే లేబర్ పేమేంట్ సకాలంలో వస్తున్నటికీ మెటీరియల్ డబ్బులు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఇంకుడు గుంతల నిర్మాణాలకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలకు వీటి నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు.

నీరు వృథా కాకుండా..

వర్షపు నీరు మురికి కాలువలలోకి వృథాగా పోకుండా భూమిలోకి ఇంకిస్తే అసలు బోర్లు ఎండిపోయే పరిస్థితి రాదు. గతంలో ఇంకుడు గుంతలు నిర్మించినప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడంతో వర్షపు భూమిలోకి చేరకుండా నీరు వృథా అయ్యే అవకాశం ఉంది. వాటికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకువస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం



ప్రస్తుతం ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎవరైనా ఇంకుడు గుంత నిర్మించుకుంటామని దరఖాస్తు చేసుకుంటే అలాంటి వారికి మంజూరు చేస్తాం.

– జాకీర్ ఉస్సేన్, ఏపీవో, ఎస్ఆర్ఈజీఎస్, ఆదిలాబాద్ రూరల్

సమస్యల పరిష్కారానికి కృషి



ధన్నూర్ వంతెనను పరిశీలిస్తున్న ఆడె గజేందర్

బోథ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నూర్ (బి), నాగాపూర్ గ్రామాల్లో పర్యటించారు. నాగాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ధన్నూర్ (బి)లో వంతెన నిర్మాణానికి రూ. 8 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. గ్రామంలో పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాల్ల ఇంద్రారెడ్డి, అధికార ప్రతినిధి చంటి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయకుమార్ రెడ్డి, గజానంద్, సుభాష్, అభిరెడ్డి, వినిత్ రెడ్డి, భోజారెడ్డి, గోవింద్, మోర స్వామి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: కేశవపట్నం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం నేరడిగొండలో ఎమ్మెల్యే నివాసంలో కేశవపట్నం గ్రామస్తులు కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాల వారీగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వ్యాధుల నిర్మూలనకు గుళిక మందు

ఆదిలాబాద్‌టౌన్: ఉబ్బసం, ఆయాసం, అస్తమా వంటి అనేక వ్యాధుల నిర్మూలనకు గుళిక మందు దోహదం చేస్తుందని ఆయుర్వేద వైద్యుడు యువరాజ్ వైద్య అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో ఆయుర్వేద గుళికల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుళిక మందు పంపిణీ అతి పురాతనమైందన్నారు. గత 25 ఏళ్లుగా మృగశిర కార్తె రోజున ఆయుర్వేద గుళికలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

మండలాల్లో వర్షం



ఇంద్రవెల్లిలో కురుస్తున్న వర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. సాయంత్రం ఒకసారిగా వాతావరణం చల్లబడి గాలివానతో పాటు ఉరుములతో కూడిన వర్షం పడింది. మండలంలోని తాంసి, వడ్డాడి, పొన్నారితో పాటు హస్నాపూర్ గ్రామాల్లో వర్షం కురువగా.. భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి, నిపాని, కరంజి(టి), వడూర్, ధనోర, గోన గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు వాగాయితండా, ఈశ్వర్‌నగర్, హీరాపూర్, ఏమాయికుంట, ముత్నూర్, కేస్లాగూడ గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రేకులషెడ్డులో నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కాగా.. మండలంలో వర్షం కురువడంతో ముందస్తుగా పత్తి విత్తనాలు నాటిన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మల్లన్న ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: సిరిచెల్మ మల్లన్న ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మల్లన్న భక్తులు, రైతులు ఆలయంలోని గర్భగుడిలో విత్తనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మల్లన్న ఆశీర్వదంతో ఈఏడాది పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా పడి దిగుబడులు రావాలని వేడుకున్నారు. ఆలయం రైతులతో సందడిగా మారింది.

ప్రైవేట్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న గణేష్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల బస్సులను రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ తనిఖీలు చేశాకే, విద్యార్థుల తరలింపునకు అనుమతి ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీష్, మడావి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పలు విద్యాసంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, షూస్ సాక్స్ యూనిఫాంలు అమ్ముతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వాటిని విక్రయించరాదని ఉత్తర్వులు జారీ చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. డీఈవో ప్రణీత పట్టించుకోకుండా ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి నాగేందర్, నాయకులు మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై శిక్షణ

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆయిల్‌పాం రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుఖర్చులు, ప్రభుత్వం ఇచ్చే రాయితీ, తెగుళ్ల నివారణకు చర్యలు, ఇతర యాజమాన్య పద్ధతులను ఉద్యానశాఖ క్లస్టర్ అధికారిణి సాదుల మౌనిక వివరించారు. ఆయిల్‌పాం మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రియూనిక్ కంపెనీ జిల్లా జనరల్ మేనేజర్ మల్లేశ్వర్ రైతులకు అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



హెచ్ఎం రిలీవ్ ఆర్డర్ ఇస్తున్న ఉపాధ్యాయులు

తాంసి: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యారు. తమ బదిలీ అయిన పాఠశాలలో విధుల్లో చేరారు. తాంసి పాఠశాల నుంచి నలుగురు బదిలీపై వెళ్లగా.. ఐదుగురు ఉపాధ్యాయులు నూతనంగా చేరారు. పొన్నారి, కప్పర్ల పాఠశాల నుంచి ఒక్కొక్కరు బదిలీపై వెళ్లగా.. గోట్కూరి ఉర్దూ పాఠశాలలో ఇద్దరు విధుల్లో చేరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, సంజీవ్ రెడ్డి విధుల్లో చేర్చుకున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయని జడ్జి హుస్సేన్ తెలిపారు. బ్యాంకు అదాలత్ ద్వారా 36 కేసుల్లో రూ. 39,75,000లు రికవరీ అయ్యాయని, నేరం ఒప్పుకోవడం వల్ల 18 కేసులు, స్పెషల్ టరమ్స్ అండ్ కండీషన్స్(ఎస్టీసీ) కేసులు 103, ఎక్సైజ్ కేసులు 51, రాజీమార్గం ద్వారా 25 కేసులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే, అంగద్ కేంద్రే, మోహన్ రావ్, పంద్రం శంకర్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, జమీర్, ధమ్మపాల్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, బోథ్ ఎస్సై రాము, బజార్‌హత్నూర్ ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



చిన్నారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దంపతులు

ఇంద్రవెల్లి: పిడుగు పడి మృతి చెందిన భార్య, భర్తల దంపతుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం డొంగర్‌గామ్ గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండి మసూద్, మాజీ సర్పంచ్ రాథోడ్ రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి అనక సంతోష్, స్వప్న దంపతులు రెండు రోజుల క్రితం పిడుగు పడి మృతి చెందారు. వారి కుటుంబ పరిస్థితిని ఎంపీ గోడం నగేశ్ దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మరప రాజు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తాం

ఎదులాపురం: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తామని బ్రాహ్మణ మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు విశ్వాస్ నిర్మల్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి రామాలయంలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో చదువులో ప్రతిభ కనబరిచిన నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులను శనివారం సన్మానించారు. విద్యార్థులకు చదువులో ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సంతోశ్ టేంబెకర్, కోశాధికారి ధనుంజయ్, బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు అన్నోజుల సంతోశ్, కోశాధికారి అభిలాష్, అరుణ్ రావు, జయసింహారావు, హరీశ్ జోషి, నాగరాజు, దేవ్షళ్ల సంతోశ్, విజయసారథి పాల్గొన్నారు.

మట్టిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని దేవపూర్ గ్రామంలో పంటపొలాలకు వెళ్లే రోడ్డుకు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ నిధుల నుంచి రోడ్డు పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రోడ్డు సౌకర్యం లేక పంట పొలాలకు ఎరువులు, పండించిన పంటను తీసుకురావడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ సర్పంచ్ తిరుపతి, వెంకన్న యాదవ్, సుభాష్ రెడ్డి, మహేందర్, కాశీం పాల్గొన్నారు.